quicktodaynews.com RNI NO : TELTEL/2023/86487

# క్విక్ టుడే

QUICK TODAY DAILY దినపత్రిక

EDITOR : GILLALA BUCHI REDDY. 8125972476 | మల్కాజిగిరి | సంపుటి : 1 | సంచిక : 313 | బుధవారం 7 ఆగస్టు 2024 | వెల : 3 రూ/.. | పేజీలు - 8

## సంకల్ప బలమే ప్రధానం


### భారత అంధుల క్రికెట్ జట్టుతో సీఎం



**హైదరాబాద్, ఆగస్టు 6 (క్విక్ టుడే న్యూస్) :** జీవితంలో ఎన్ని సవాళ్లు ఎదురైనా, లక్ష్యాన్ని సాధించాలన్న సంకల్ప బలం మనలో ఉండటం ప్రధానమని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారు అన్నారు. అమెరికా పర్యటనలో ఉన్న ముఖ్యమంత్రిగారు న్యూయార్క్ నగరంలో భారత అంధుల క్రికెట్ జట్టు క్రీడాకారులను కలుసుకున్నారు. వారిని కలుసుకున్న సందర్భం తనకు లభించిన ఒక అమూల్యమైన అవకాశంగా భావిస్తున్నానని ముఖ్యమంత్రి గారు అన్నారు. వారితో ఆప్యాయంగా కొద్దిసేపు ముచ్చటించారు. జీవితంలో ఎలాంటి సవాళ్లయినా ఎదుర్కొనే మానసిక స్థైర్యాన్ని వారి నుంచి నేర్చుకోగలమన్నారు. వారిలోని స్ఫూర్తిని అభినందిస్తూ వారికి ముఖ్యమంత్రి గారు శుభాకాంక్షలు తెలియజేశారు.

## అద్వానీకి మరోమారు అస్వస్థత

### ఆస్పత్రికి తరలించి చికిత్స



## చైనాకు ప్రత్యామ్నాయంగా ఎదుగుదాం

### తెలంగాణ అంటేనే.. పెట్టుబడుల గమ్యస్థానం

### హైదరాబాద్ 4.0 ఫ్యూచర్ సిటీ ఇండియాకు కొత్త చిరునామా

### వ్యాపారాలకు సులభంగా కొత్త పారిశ్రామిక విధానం

### అమెరికాలో పారిశ్రామికవేత్తలతో సీఎం రేవంత్ రెడ్డి



**హైదరాబాద్, ఆగస్టు 6 (క్విక్ టుడే న్యూస్) :** తెలంగాణలో పెట్టుబడులకు అపారమైన అవకాశాలున్నాయని ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. పరిశ్రమల అవసరాలు, అభిరుచికి అనుగుణంగా తమ ప్రభుత్వం నూతన పారిశ్రామిక విధానాన్ని రూపొందిస్తుందని ప్రకటించారు. అమెరికాలో ఉన్న వ్యాపార అవకాశాలన్నీ తెలంగాణలో ఉన్నాయని, చైనాకు ప్రత్యామ్నాయంగా ఎదగాలనేది తమ సంకల్పమని అన్నారు. తెలంగాణ అంటేనే వ్యాపారం.. తెలంగాణ అంటేనే పెట్టుబడులకు గమ్యస్థానంగా మారుస్తామని చెప్పారు. రాష్ట్రంలో చేపట్టిన ప్రతిష్టాత్మకమైన ప్రాజెక్టులను ఈ సందర్భంగా సీఎం వివరించారు. త్వరలోనే హైదరాబాద్లో నాలుగో నగరంగా ఫ్యూచర్ సిటీని నిర్మిస్తున్నామని చెప్పారు. ఇది భారత దేశపు భవిష్యత్తుకు చిరునామాగా నిలుస్తుందని అభిప్రాయ పడ్డారు. దేశంలోనే జీరో కార్బన్ సిటీ ఇక్కడ ఏర్పడతుందని అన్నారు. ఫ్యూచర్ సిటీలో అర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ హబ్తో పాటు, మెడికల్, టూరిజం, స్పోర్ట్స్, సాఫ్ట్‌వేర్

మిగతా 2లో..

## హైదరాబాద్‌లో ట్రైజిన్ ఏఐ ఇన్నోవేషన్ సెంటర్

### ఆరు నెలల్లో కార్యకలాపాల ప్రారంభం..

### వెయ్యి మందికిపైగా ఉద్యోగాలు, శిక్షణ

### సీఎం రేవంత్‌తో ట్రైజిన్ కంపెనీ ప్రతినిధుల భేటీ



### మానవతా దృక్పథంతో

## హసీనాకు ఆశ్రయం

### బంగ్లాదేశ్ పరిస్థితులపై కన్నేసి ఉంచాం

### ఎప్పటికప్పుడు ఆరా తీస్తున్నాం

### అఖిలపక్షంలో జయశంకర్ వెల్లడి

**న్యూఢిల్లీ, అగస్ట్6 :** బంగ్లాదేశ్‌లో నెలకొన్న రాజకీయ అస్థిర పరిస్థితులను కేంద్రం నిశితంగా గమనిస్తోంది. ఈ క్రమంలో అఖిలపక్ష సమావేశం నిర్వహించింది. అక్కడి పరిణామాల గురించి విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్ అఖిలపక్ష పార్టీల నేతలకు వివరించారు. భారతీయుల్ని తరలించేంత ప్రమాదకరంగా అక్కడి పరిస్థితులు లేవని వెల్లడించారు. 'భారతీయలను తరలించేంతగా బంగ్లాదేశ్‌లోని పరిస్థితులు ప్రమాదకరంగా లేవు. కానీ అక్కడి పరిస్థితుల్ని అత్యంత అప్రమత్తతతో గమనిస్తున్నాం. బంగ్లాదేశ్‌లో

మిగతా 2లో..

### మెడిసిన్ సీట్ల విషయంలో

## లోకల్ సమస్య

### తెలంగాణ విద్యార్థులకు అన్యాయం చేస్తారా

### ఎక్స్ వేదికగా ప్రభుత్వానికి కెటిఆర్ ప్రశ్న



## ఆగస్టు 15 నాటికి రూ.2 లక్షల రుణమాఫీ

### రుణమాఫీ అందని వారు ఫిర్యాదు చేయొచ్చు

### బీఆర్ఎస్ రాజకీయ విమర్శలను పట్టించుకోం

### మంత్రి తుమ్మల నాగేశ్వర రావు వెల్లడి



**హైదరాబాద్, ఆగస్టు 6 (క్విక్ టుడే న్యూస్) :** గతంలో రుణమాఫీ సరిగా జరగలేదన్న భావన రైతుల్లో ఉందని తెలంగాణ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. ఓఆర్ఆర్‌ను రూ.7 వేల కోట్లకు అమ్మి రుణమాఫీ చేయాలని గత ప్రభుత్వం ఆలోచించిందని విమర్శించారు. సచివాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. గత పాలకులు సరైన పద్ధతిలో రుణమాఫీ చేయకపోయినప్పటికీ ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వాన్ని మాత్రం విమర్శిస్తున్నారని మండిపడ్డారు. రైతుల ద్వారా రాజకీయ లబ్ధి పొందలేరని వ్యాఖ్యానించారు. వరంగల్ డిక్లరేషన్‌లో ప్రకటించిన విధంగా కాంగ్రెస్ ప్రభుత్వం రుణమాఫీ చేస్తోంది. ఎన్ని కష్టాలున్నా ఈ అంశంలో ముందుకెళ్తున్నాం. ప్రతిపక్ష నేతలు అనవసర ఆరోపణలు చేస్తున్నారు. గత ఐదేళ్లలో రైతులు తీసుకున్న రుణాలను మాఫీ చేస్తున్నాం. మూడు విడతల్లో ఈ పక్రియ కొనసాగుతోంది. పాస్‌బుక్ లేకపోయినా.. తెల్లకార్డు ద్వారా రుణమాఫీ చేస్తున్నాం. రుణాలు మాఫీ కాకపోయినా రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. సాంకేతిక కారణాల వల్ల 30 వేల ఖాతాల్లో డబ్బులు జమ కాలేదు. పొరపాట్లు సరిచేసి అర్హులందర్నీ రుణ విముక్తుల్ని చేస్తాం. ఆగస్టు 15న రూ.2 లక్షల వరకు రుణమాఫీ కార్యక్రమాన్ని వైరాలో సీఎం రేవంత్‌రెడ్డి ప్రారంభిస్తారు. రైతు భరోసాపై అభిప్రాయ సేకరణ కొనసాగుతోందని తుమ్మల వెల్లడించారు. రుణమాఫీ రైతులెవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు. ఆగస్టు 14న లక్షన్నర నుంచి 2 లక్షల వరకు ఉన్న రుణాలు మాఫీ చేస్తామని చెప్పారు. 2 లక్షల రుణమాఫీకి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ఇంత వరకు ఏ రాష్ట్రం పూర్తి స్థాయిలో రుణమాఫీ

మిగతా 2లో..



### ఢిల్లీ లిక్కర్ కేసులో

## కీలక పరిణామం

### డిఫాల్ట్ బెయిల్ పిటిషన్ ఉపసంహరించుకున్న కవిత

### సాగర్, శ్రీశైలంలకు

## భారీగా వరద

### గేట్లు ఎత్తి నీటి విడుదల



**నాగార్జునసాగర్, ఆగస్ట్6 (క్విక్ టుడే న్యూస్) :** ఎగువ ప్రాంతాల నుంచి కృష్ణా నదికి వరద నీరు పోటెత్తుతోంది. దీంతో శ్రీశైలం, నాగార్జున సాగర్ ప్రాజెక్టుల నుంచి దిగువకు నీటి విడుదల కొనసాగుతోంది. నాగార్జునసాగర్ ప్రాజెక్టు 22 గేట్లు ఎత్తి నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. జలాశయం పూర్తి స్థాయి నీటిమట్టం

మిగతా 2లో..

## ఆదేశాలిచ్చేదాకా చర్యలు తీసుకోరా?

### ఎమ్మెల్యే ఫిరాయింపులపై హైకోర్టు విచారణ

### స్పీకర్ నిర్ణయం తీసుకోకపోవడంపై ప్రశ్న




హైదరాబాద్,ఆగస్ట్6(ఆర్ఎన్ఎ): పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేలపై చర్యలు తీసుకునేలా ఆదేశాలివ్వాలన్న పిటిషన్లపై కోర్టులో తేలేదాకా స్పీకర్ నిర్ణయం తీసుకోరా.. అంటూ హైకోర్టు సోమవారం అడ్వొకేట్ జనరల్ ని ప్రశ్నించింది. ఇప్పటికే నెల గడిచిందని, ఒకవేళ ఇంకో మూడు నెలలు వీటిపై నిర్ణయం వెలువరించక పోతే స్పీకర్ కూడా చర్యలు చేపట్టరా అని అడిగింది. భారాస తరఫున ఎన్నికై కాంగ్రెస్‌లో చేరిన ఎమ్మెల్యేలు తెల్లం వెంకట్రావు, కడియం శ్రీహరి, దానం నాగేందర్‌లపై అనర్హత వేటు వేసేలా స్పీకర్‌కు ఆదేశాలు జారీ చేయాలంటూ భారాస ఎమ్మెల్యేలు

మిగతా 2లో..

### నగర తాగునీటికి గోదావరి

## రెండోదశకు పచ్చజెండా

### ప్రాజెక్టు పనులకు రూ.5,560 కోట్లు కేటాయించిన ప్రభుత్వం



**హైదరాబాద్, ఆగస్టు 6 (క్విక్ టుడే న్యూస్) :** హైదరాబాద్ మహానగర తాగునీటి అవసరాలను మెరుగుపరిచేందుకు గోదావరి డ్రింకింగ్ వాటర్ సప్లై ఫేజ్-2కు ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. ఈ మేరకు పురపాలకశాఖ ముఖ్య కార్యదర్శి దాన కిశోర్ మంగళవారం జీవో జారీ చేసింది. రెండో దశ పనులకు ప్రభుత్వం రూ.5,560 కోట్లు కేటాయించింది. ఈ ప్రాజెక్టులో నగరానికి అదనపు జలాలను తరలించడంతో పాటు హిమాయత్‌సాగర్, ఉస్మాన్‌సాగర్ జలాశయాలను సైతం నింపనున్నది. హైబ్రిడ్ యాన్యుటీ మోడ్ విధానంలో పనులు పూర్తి చేయనుంది. ప్రస్తుతం హైదరాబాద్ తాగునీటి అవసరాలకు అన్ని సోర్సుల నుంచి 580 ఎంజీడీల నుంచి 600 ఎంజీడీల నీరు సరఫరా అవుతున్నది. 2030 నాటికి నీటి అవసరాలను దృష్టిలో పెట్టుకొని 170 ఎంజీడీల అదనపు జలాల్ని సరఫరా చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకున్నది. ఇందు కోసం గోదావరి నుంచే 30 టీఎంసీల నీటిని వాడుకునే వెసులుబాటు ఉన్నది. 2030 నాటికి హైదరాబాద్ నగర తాగునీటి డిమాండ్ 750 ఎంజీడీలకు పెరుగుతుందని అంచనా. 2050 నాటికి 1014 ఎంజీడీలుగా ఉండబోతున్నది. ఫేజ్-1 కింద నగర ప్రజల నీటి అవసరాల కోసం ఎల్లంపల్లి ప్రాజెక్టు నుంచి జలమండలి ఇప్పటికే 10 టీఎంసీల నీరు తరలిస్తున్నది. తాజాగా పథకం రెండో దశ ద్వారా మల్లన్న సాగర్ రిజర్వాయర్ నుంచి మరో 15 టీఎంసీల నీరు వాడుకునే అవకాశం ఉంది. ఈ 15 టీఎంసీల్లో 10 టీఎంసీలు నగర ప్రజల తాగునీటి అవసరాలకు పోగా.. మూసీ ప్రక్షాళనలో భాగంగా జంట జలాశయాలను పునరుజ్జీవనం చేసేందుకు మిగిలిన 5 టీఎంసీలను ఉపయోగించనున్నారు. ప్రాజెక్టుకు సంబంధించిన డీపీఆర్‌ను వాప్కోస్ కంపెనీ సిద్ధం చేసింది. రెండేళ్లలో ఈ ప్రాజెక్టు నిర్మాణం పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నది.

మొదటి పేజీ తరువాయి..

# చైనాకు ప్రత్యామ్నాయంగా ఎదుగుదాం

, ఫార్మా విలేజ్లను అభివృద్ధి చేస్తామన్నారు. ఈ ఫ్యూచర్ సిటీ రాష్ట్ర అభివృద్ధితో పాటు పరిశ్రమలకు సిరుల పంట పండిస్తుందని అభిప్రాయపడ్డారు. తెలంగాణలో వ్యాపారాలు, పెట్టుబడుల విస్తరణను సులభతరం చేస్తామని సీఎం ప్రకటించారు. అటువంటి సరికొత్త ఆలోచనలతోనే కొత్త పారిశ్రామిక విధానాన్ని రూపొందిస్తున్నట్లు తెలిపారు. సోమవారం న్యూయార్క్‌లోని కాన్సులేట్ జనరల్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో వర్కింగ్ లంచ్ అనంతరం ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి వివిధ రంగాలకు చెందిన పారిశ్రామికవేత్తలతో రౌండ్‌టేబుల్ సమావేశమయ్యారు. ఫార్మా, ఐటీ, టెక్నాలజీ, ఈవీ, బయోటెక్, షిప్పింగ్ రంగాల్లో పేరొందిన కంపెనీలకు ప్రాతినిధ్యం వహిస్తున్నఛైర్‌పర్సన్‌లు, సీఈవోలు ఈ సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా హైదరాబాద్తో పాటు తెలంగాణ రాష్ట్రాన్ని పారిశ్రామిక క్లస్టర్లుగా విభజించి, అభివృద్ధి చేసేందుకు రూపొందించిన భవిష్యత్తు ప్రణాళికలు, తెలంగాణ చరిత్రపై ముఖ్యమంత్రి ప్రజంటేషన్ ఇచ్చారు. అనంతరం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రసంగించారు. తన మనసులోని మాటలతో పాటు తమ ప్రభుత్వం ఏం కోరుకుంటుందో.. తన రాష్ట్ర ప్రజల ఆకాంక్షలేమిటో వెల్లడిస్తానంటూ అందరినీ ఉత్సాహపరిచారు. ముఖ్యమంత్రి హోదాలో ఇది తన మొదటి అమెరికా పర్యటన అని.. ఇక్కడి నుంచి వీలైనన్ని పెట్టుబడులు తెలంగాణకు తీసుకెళ్లాలలన్నదే తన లక్ష్యమని ప్రకటించారు. పెట్టుబడుల గమ్యస్థానంగా దేశంలోనే అందరినీ ఆకర్షిస్తున్న తెలంగాణకు ఉన్న అనుకూలతలన్నింటినీ ముఖ్యమంత్రి ఈ సందర్భంగా వివరించారు. ఇప్పటికే సాఫ్ట్‌వేర్, లైఫ్–సైన్స్, ఫార్మా రంగాల్లో తెలంగాణ అగ్రగామిగా నిలిచిందని, ఏరోస్పేస్, డిఫెన్స్, ఎలక్ట్రానిక్స్ తదితర రంగాలలో బలమైన పునాదులు వేసుకుందని చెప్పారు. కోవిడ్ను అధిగమించేందుకు మిలియన్ల కొద్దీ వ్యాక్సిన్‌లను తయారు చేసి ప్రపంచానికి సాయం చేసిందని అన్నారు. తెలంగాణలో అద్భుతమైన మౌలిక సదుపాయాలు ఉన్నాయని, అద్భుతమైన ప్రతిభ సంపద సిద్ధంగా ఉందని అన్నారు. రాష్ట్రంలో పెట్టుబడులకు ముందుకు వచ్చే పెట్టుబడిదారులకు రాష్ట్ర ప్రభుత్వం అత్యుత్తమమైన మద్దతును అందిస్తుందని ప్రకటించారు. నిజాంలు నిర్మించిన 425 సంవత్సరాల పురాతనమైన హైదరాబాద్, ఇంచుమించుగా యునైటెడ్ స్టేట్స్ ఆఫ్ అమెరికాతో సమకాలీనంగా ఉండటం ఆసక్తి రేపుతోందని అన్నారు.తెలంగాణను చైనాకు ప్రత్యామ్నాయ ఉత్పత్తి కేంద్రంగా తీర్చిదిద్దాలనే ముఖ్యమంత్రి దార్శనికతను ఐటీ శాఖ మంత్రి శ్రీధర్బాబు ఈ సందర్భంగా పారిశ్రామికవేత్తలకు వివరించారు. ప్రపంచంలోనే టాప్ టెన్ సిటీల్లో ఒకటిగా హైదరాబాద్ను అభివృద్ధి చేస్తామని, ఆ దిశగా రూపొందించిన భవిష్యత్తు ప్రణాళికలను విశ్లేషించారు. ఈ సమావేశం తెలంగాణలో కొత్త పెట్టుబడులకు మరింత ఊతమిస్తుందనే ఆకాంక్షను వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో కార్నింగ్ కంపెనీ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ రోనాల్డ్ వెర్క్లెరెన్, కేకేఆర్ పార్టనర్ దినేష్ పలివాల్, సిగ్నా ఇంటర్నేషనల్ పబ్లిక్ పాలసీ హెడ్ ఎక్రమ్ సర్వర్, న్యూజెర్సీ చీఫ్ బిజినెస్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ బిల్ నూనన్, సేఫ్‌సీ గ్రూప్ ఛైర్మన్ ఎస్వీ అంచన్, టిల్మాన్ హోల్డింగ్స్ ఛైర్మన్ సంజీవ్ అహుజా, అమ్నీల్ ఫార్మా కో సీఈవో చింటూ పటేల్, జేపీ మోర్గాన్ చేజ్ ఈడీ రవి లోచన్ పోలా, ఆక్వాటెక్ వైస్ ప్రెసిడెంట్ (ఫైనాన్స్) సుబ్బారావు, యాక్సెంచర్ ఎండీ అమిత్కుమార్, డెలాయిట్ ఎండీ పునిత్ లోచన్, హాబిట్స్ చీఫ్ టెక్నాలజీ ఆఫీసర్ వీర బుద్ధి, బీఎన్వై మెల్లన్ ఎండీ అట్లూరి, పేస్ యూనివర్సిటీ డీన్ డా. జోనాథన్ హిల్, అకుజెన్ చీఫ్ సైంటిఫిక్ హెడ్ అరుణ్ ఉపాధ్యాయ, ఎస్ అండ్ పీ గ్లోబల్ కంపెనీ వైస్ ప్రెసిడెంట్ స్వామి కొచ్చెర్లకోట, ఇంటర్కాంటినెంటల్ ఎక్స్ఛేంజ్ ఎండీ అశ్విని పన్సే పాల్గొన్నారు.



### ఢిల్లీ లిక్కర్ కేసులో
# కీలక పరిణామం
### డిఫాల్ట్ బెయిల్ పిటిషన్ ఉపసంహరించుకున్న కవిత

**న్యూఢిల్లీ, ఆగస్ట్6 :** దేశ వ్యాప్తంగా పెను సంచలనం సృష్టించిన ఢిల్లీ లిక్కర్ పాలసీ సీబీఐ కేసులో కీలక పరిణామం చోటు చేసుకుంది. రౌస్ అవెన్యూ కోర్టులో డిఫాల్ట్ బెయిల్ పిటిషన్‌ను బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత ఉపసంహరించుకున్నారు. సోమవారం రౌస్ అవెన్యూ కోర్టులో కవిత డిఫాల్ట్ బెయిల్ కేసు విచారణ వాయిదా పడింది. కవిత తరపు న్యాయవాదులు విచారణకు హాజరుకాకపోవడంతో జడ్జి కావేరి బవేజా అసహనం వ్యక్తం చేశారు. వాదనలకు రాకపోతే పిటిషన్ ఉపసంహరించుకోవాలని జడ్జి కావేరి బవేజా పేర్కొన్నారు. రేపటికి కేసును వాయుదా వేస్తూ కోర్టు తుది విచారణ జరుపుతామని తెలిపింది. బుధవారం విచారణ జరగనున్న నేపథ్యంలోకేసును కవిత న్యాయవాదులు ఉపసంహరించుకున్నారు. సీబీఐ చార్జ్‌షీట్ లో తప్పులు ఉన్నాయని కవిత డిఫాల్ట్ బెయిల్‌కు అర్హురాలని జూలై 6న కవిత న్యాయవాదులు డిఫాల్ట్ బెయిల్ పిటిషన్ వేశారు. చార్జ్ షీట్లో తప్పులేవి లేవని సీబీఐ తెలిపింది. ఇప్పటికే సీబీఐ చార్జ్ షీట్‌ను జూలై 22న కోర్టు పరిగణనలోకి తీసుకుంది. ఆగస్టు 9న చార్జ్ షీట్‌పై రౌస్ అవెన్యూ కోర్టు విచారణ జరపనుంది. ఢిల్లీ లిక్కర్ స్కామ్ కేసులో బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ఇప్పట్లో తీహార్ జైలు నుంచి బయటికి వచ్చే మార్గాలు ఏ మాత్రం కనిపించట్లేదు. ఇప్పటికే బెయిల్ పిటిషన్‌ను పలుమార్లు పక్కనెట్టిన రౌస్ అవెన్యూ కోర్టు.. సోమవారం నాడు డీఫాల్ట్ బెయిల్ పిటిషన్ విచారణను వాయిదా వేసింది. ఇవాళైనా విచారణకు వస్తుందనుకుంటే.. రౌస్ అవెన్యూ కోర్టులో డిఫాల్ట్ బెయిల్ పిటిషన్‌ను బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత ఉపసంహరించుకున్నారు. కవితను మార్చి– 15న తొలుత ఈడీ, ఆ తర్వాత ఏప్రిల్– 11న సీబీఐ అరెస్టు చేసిన విషయం తెలిసిందే. అప్పటి నుంచి కూడా కవిత బెయిల్ కోసం ప్రయత్నిస్తున్నారు. అయితే ఈడీ, సీబీఐ పెట్టిన రెండు కేసుల్లోనూ సాధారణ బెయిల్ ఇవ్వాలన్న పిటిషన్‌ను గతంలోనే ట్రయల్ కోర్టు కొట్టివేసింది. ఈ ఆదేశాలను ఢిల్లీ హైకోర్టులో కవిత సవాల్ చేశారు. అయితే ఆమెకు అక్కడ కూడా నిరాశే ఎదురైంది. ఈ నేపథ్యంలోనే ట్రయల్ కోర్టులోనే మళ్లీ బెయిల్ పిటిషన్ దాఖలు చేశారు. దీన్ని జూలై– 22న విచారించిన ట్రయల్ కోర్టు జడ్జి కావేరి బవేజా కేసును సోమవారానికి(ఆగస్టు–05) వాయిదా వేశారు. నిన్న విచారణకు కవిత తరుఫు న్యాయవాదులు హాజరు కాలేదు. ఇవాళ డీఫాల్ట్ బెయిల్ పిటిషన్‌ను కవిత ఉపసంహరించుకున్నారు.

### సాగర్, శ్రీశైలంలకు
# భారీగా వరద

590 అడుగులు కాగా.. ప్రస్తుతం 585.40 అడుగులకు చేరుకుంది. మొత్తం నీటి నిల్వ సామర్థ్యం 312 టీఎంసీలు కాగా.. ప్రస్తుతం 298.58 టీఎంసీలుగా ఉంది. జలాశయానికి 3,54,831 క్యూసెక్కుల ప్రవాహం వస్తోంది. దిగువకు 3,14,761 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. సాగర్ జలాశయం కుడి, ఎడమ కాల్వలకు నీటి విడుదల కొనసాగుతోంది. మరోవైపు శ్రీశైలం జలాశయానికి కూడా వరదనీరు పోటెత్తుతోంది. ప్రాజెక్టు 10 గేట్లను 12 అడుగుల మేర ఎత్తి స్పిల్‌వే ద్వారా 3.10 లక్షల క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. జూరాల, సుంకేశుల ప్రాజెక్టుల నుంచి 3.93 లక్షల క్యూసెక్కుల నీరు శ్రీశైలానికి వస్తున్నట్లు అధికారులు తెలిపారు. శ్రీశైలం ప్రాజెక్టు గరిష్ఠ నీటిమట్టం 885 అడుగులు కాగా.. గరిష్ఠ నీటి నిల్వ సామర్థ్యం 215.80 టీఎంసీలు. జలాశయంలో ప్రస్తుతం 204.35 టీఎంసీల నీరు ఉంది. కుడి, ఎడమ జల విద్యుత్ కేంద్రాల ద్వారా పెద్ద మొత్తంలో విద్యుత్ ఉత్పత్తి చేస్తున్నారు. తద్వారా మరో 64,338 క్యూసెక్కుల నీరు సాగర్‌కు విడుదలవుతోంది.

### ఆగస్ట్ 15 నాటికి
# రూ.2 లక్షల రుణమాఫీ

చేయలేదన్నారు. గత ప్రభుత్వం రాష్ట్రాన్న అప్పుల పాలు చేసిందని మండిపడ్డారు. రుణమాఫీ కానీ రైతులు అధికారులకు ఫిర్యాదు చేయొచ్చని చెప్పారు. రుణమాఫీ కానీ రైతులు వివరాలు ఇవ్వాలని సూచించారు. రుణమాఫీలో టెక్నికల్ ఇష్యూ ఉంటే క్లియర్ చేస్తామని చెప్పారు.కేంద్రప్రభుత్వం కూడా రైతుల్నిపట్టించు కోలేదన్నారు తుమ్మల. రైతు చట్టాలతో కేంద్రం ఇబ్బంది పెట్టిందన్నారు. కేంద్ర బ్జడెట్ లో రాష్ట్రానికి అన్యాయం జరిగిందన్నారు. రైతుల పేరు మీద బీఆర్ఎస్ పొలిటికల్ డ్రామాలు ఆడుతోందని విమర్శించారు తుమ్మల. రుణమాఫీపై కూడా కొందరు రాజకీయం చేస్తున్నారని అన్నారు. అన్ని వ్యవస్థలను బీఆర్ఎస్ సర్వనాశనం చేసిందన్నారు. 2022లో ఎన్నికల ముందు భూములు అమ్మి రుణమాఫీ చేశారని చెప్పారు. గత సర్కార్ రుణమాఫీ పేరుతో రైతుల్ని ముంచిందన్నారు తుమ్మల. రైతు బీమా స్కీంను కంటిన్యూ చేస్తామని చెప్పారు. బీఆర్ఎస్ పనికి మాలిన రాజకీయాలు బంద్ చేసుకోవాలని సూచించారు తుమ్మల.

### హైదరాబాద్‌లో
# ట్రైజన్ ఏఐ ఇన్నోవేషన్ సెంటర్
### ఆరు నెలల్లో కార్యకలాపాల ప్రారంభం..
### వెయ్యి మందికిపైగా ఉద్యోగాలు, శిక్షణ
### సీఎం రేవంత్‌తో ట్రైజన్ కంపెనీ ప్రతినిధుల భేటీ



**హైదరాబాద్, ఆగస్టు 6 (క్విక్ టుడే న్యూస్) :** ట్రైజిన్ టెక్నాలజీస్ కంపెనీ (ట్రైజిన్ ) హైదరాబాద్ లో తమ అర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ సెంటర్ నెలకొల్పనుంది. అమెరికా పర్యటనలో ఉన్న తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి, ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు నేతృత్వంలోని అధికారుల బృందంతో ట్రైజిన్ కంపెనీ ప్రతినిధులు ప్రత్యేకంగా సమావేశమయ్యారు. రాష్ట్రంలో ఏర్పాటు చేయబోయే సెంటర్ పై ఈ సందర్భంగా చర్చలు జరిపారు. ట్రైజిన్ కంపెనీ డేటా అనలిటిక్స్, అర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ స్టార్టప్‌లకు అవసరమయ్యే ఇంటెలిజెన్స్ సొల్యూషన్స్ అందిస్తుంది. హైదరాబాద్ లో ట్రైజిన్ కంపెనీ అర్టిఫిషియల్ ఇంటెలెజెన్స్ ఇన్నోవేషన్ అండ్ డెలివరీ సెంటర్ ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించింది. రాబోయే మూడేండ్లలో 1,000 మందికి పైగా ఉద్యోగులను నియమించుకొని శిక్షణను అందిస్తుంది. ట్రైజిన్ కంపెనీ మొత్తం ఆదాయం 160 మిలియన్ డాలర్లకు పైగా ఉంది. ప్రపంచ వ్యాప్తంగా ఈ కంపెనీలో పని చేస్తున్న 2,500 మందిలో వెయ్యి మంది మన దేశంలో ఉండగా, ప్రస్తుతం హైదరాబాద్‌లో దాదాపు వంద మంది ఉన్నారు. మరో ఆరు నెలల్లోనే తమ కార్యకలాపాలను ప్రారంభించనున్నట్లు ఈ కంపెనీ ప్రకటించింది. రెండు దశాబ్దాలకు పైగా ఐక్య రాజ్య సమితితో పాటు అనుబంధ విభాగాలకు ట్రైజిన్ కంపెనీ సాంకేతిక భాగస్వామిగా వ్యవహరిస్తోంది. గత ఏడాది నుంచి ట్రైజిన్ కంపెనీ తమ సేవలను అందుకుంటున్న సంస్థల్లో అర్టిఫిషియల్ ఇంటెలెజెన్స్ వినియోగంతో పాటు ఫలితాలపై విశ్లేషణలు చేస్తోంది. అన్ని రంగాలలో అర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ను అభివృద్ధి చేయాలని లక్ష్యంగా ఎంచుకుంది.

### తెలంగాణ జనం కోసం
# పరితపించిన గద్దర్
### వర్ధంతి సందర్భంగా సిఎం రేవంత్ నివాళి

**హైదరాబాద్, ఆగస్టు 6 (క్విక్ టుడే న్యూస్) :** ప్రజా గాయకుడు గద్దర్ వర్ధంతి సందర్భంగా గద్దర్‌కు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నివాళులులర్పించారు. ఆయన చేసిన సేవలను సీఎం స్మరించుకున్నారు. పొడుస్తున్న పొద్దు మీద నడుస్తున్న కాలమా... పోరు తెలంగాణమా అంటూ ప్రత్యేక రాష్ట్ర ఉద్యమానికి ఆయువుపట్టుగా నిలిచిన వ్యక్తి గద్దర్ అని కొనియాడారు. పేద కుటుంబంలో పుట్టి ఇంజినీరింగ్ విద్యను అభ్యసించిన గద్దర్ ఉన్నత కొలువుల వైపు దృష్టి సారించకుండా ప్రతి ఒక్కరికి కూడు, గూడు, నీడ లభించాలనే లక్ష్యంతో జీవితాంత తన పాటలతో ప్రజలను చైతన్యపర్చారని పేర్కొన్నారు. తెలంగాణ జన సమితి, తెలంగాణ జన సభతో పాటు పలు ఉద్యమ సంస్థల ఏర్పాటుతో తెలంగాణ మలిదశ ఉద్యమానికి ఊపిరులూదిన వారిలో అగ్రగణ్యుడు గద్దర్ అని గుర్తు చేశారు. పాటను తూటాగా మార్చిన ప్రజా యుద్ధ నౌక గద్దర్ అని, ఆయన చేసిన సాంస్కృతిక, సాహితీ సేవకు గుర్తింపుగా నంది అవార్డులను గద్దర్ అవార్డులుగా తమ ప్రభుత్వం మార్చిందని తెలిపారు. గద్దర్‌తో తనకు ఉన్న ఆత్మీయ అనుబంధాన్ని ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గుర్తు చేసుకున్నారు.

# ఏపీలో యూట్యూబ్ అకాడమీ
### యూట్యూబ్ సీఈవోతో చర్చించినట్లు సిఎం చంద్రబాబు వెల్లడి

**అమరావతి, ఆగస్ట్6 (క్విక్ టుడే న్యూస్) :** ప్రపంచస్థాయి టెక్ దిగ్గజ సంస్థలను, పెట్టుబడులను రాష్ట్రానికి తీసుకుని రావడమే లక్ష్యంగా ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రయత్నాలు చేస్తున్నారు. ఇందులో భాగంగా మంగళవారం ఆయన యూట్యూబ్ సీఈవో నీల్ మోహన్, గూగుల్ ఏపీఏసీ హెడ్ సంజయ్ గుప్తాలతో వర్చువల్‌గా సమావేశమయ్యారు. రాష్ట్రంలో యూట్యూబ్ అకాడమీ ఏర్పాటుపై వారితో చర్చించినట్లు చంద్రబాబు 'ఎక్స్' వేదికగా ప్రకటించారు. వారిద్దరితోనూ ఆన్‌లైన్ వేదికగా భేటీ కావడం ఆనందంగా ఉందని సీఎం పేర్కొన్నారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, నైపుణ్యాభివృద్ధి, సర్టిఫికేషన్ ప్రోగ్రామ్‌లను ప్రోత్సహించేందుకు స్థానిక భాగస్వాముల సహకారంతో ఈ అకాడమీ ఏర్పాటుపై చర్చించినట్లు తెలిపారు. అలాగే, ఏపీ రాజధాని అమరావతిలో ఏర్పాటు చేయబోయే మీడియా సిటీకి సాంకేతిక సహకారం అందించే అవకాశాలపైనా వారితో చర్చించినట్లు పేర్కొన్నారు.

# ఆదేశాలిచ్చేదాకా చర్యలు తీసుకోరా?

పాడి కౌశిక్‌రెడ్డి, కె.పి.వివేకానంద్, భాజపా శాసనసభాపక్ష నేత మహేశ్వర్‌రెడ్డి దాఖలు చేసిన వేర్వేరు పిటిషన్లపై సోమవారం జస్టిస్ బి.విజయ్‌సేన్‌రెడ్డి మరోసారి విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా కోర్టులో పిటిషన్లు పెండింగ్‌లో ఉన్నంతవరకు స్పీకర్ నిర్ణయం తీసుకోరా అని న్యాయమూర్తి ప్రశ్నించగా ఏజీ ఎ.సుదర్శన్‌రెడ్డి సమాధానమిస్తూ ఇవి రాజ్యాంగపరమైన అంశాలని, వాటిని కోర్టులు దాటవేయలేవని పేర్కొన్నారు. పిటిషనర్లు కౌశిక్‌రెడ్డి, కె.పి.వివేకానంద్‌లు స్పీకర్‌కు ఫిర్యాదులు ఇచ్చిన వెంటనే హైకోర్టును ఆశ్రయించారన్నారు. వాటిని పరిశీలించడానికి స్పీకర్‌కు తగిన గడువు కూడా ఇవ్వలేదన్నారు. పిటిషనర్లు స్పీకర్‌పై తీవ్రమైన ఆరోపణలు చేయడం సరికాదన్నారు. రాజ్యాంగ పదవిలో ఉన్న స్పీకర్ నిర్ణయం తీసుకునేదాకా కోర్టులు జోక్యం చేసుకోజాలవని సుప్రీంకోర్టు వెలువరించిన పలు తీర్పులను ప్రస్తావించారు. స్పీకర్ నిర్ణయం తీసుకున్న తరువాత వాటిని సమీక్షించవచ్చన్నారు. పిటిషనర్ల తరపు సీనియర్ న్యాయవాది గండ్ర మోహన్‌రావు వాదనలు వినిపిస్తూ.. పిటిషన్లను తీసుకోవడానికే స్పీకర్ కార్యాలయం నిరాకరించిందని, హైకోర్టులో వ్యాజ్యాలు దాఖలు చేసిన తరువాత తీసుకుందన్నారు. నెల రోజుల తరువాత కోర్టును ఆశ్రయించినట్లు తెలిపారు. ట్రైబ్యునల్‌గా స్పీకర్ నిర్దిష్ట గడువులోగా పిటిషన్లను తేల్చాల్సి ఉందన్నారు. వీటిపై మంగళవారం కూడా వాదనలు కొనసాగనున్నాయి.

### మానవతా దృక్పథంతో
# హసీనాకు ఆశ్రయం

12–13 వేల మంది భారతీయులున్నారు. పొరుగుదేశంలో ఉన్న మన ప్రజల భద్రత విషయమై అక్కడి ఆర్మీతో టచ్‌లో ఉన్నాం' అని మంత్రి వెల్లడించారు. అలాగే ఆ దేశ మాజీ ప్రధాని షేక్ హసీనాతో భారత ప్రభుత్వం మాట్లాడిందన్నారు. మానవత్వ చర్యలో భాగంగానే ఆమెకు భారత్‌లో ఆశ్రయం ఇచ్చామని చెప్పారు. భవిష్యత్‌పై నిర్ణయం తీసుకోవడానికి ఆమెకు కొంత సమయం కావాలని భావిస్తున్నామని తెలిపారు. ఈ సమావేశంలో లోక్‌సభలో ప్రతిపక్ష నేత, కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ మాట్లాడుతూ.. షేక్ హసీనాను గద్దె దింపడం వెనక విదేశీ కుట్ర ఏమైనా ఉందా..? అని ప్రశ్నించారు. దీనిపై ఇప్పుడే ఒక అంచనాకు రావడం తొందరపాటు అవుతుందని మంత్రి బదులిచ్చారు. 'అయితే, పాకిస్థాన్ దౌత్యవేత్త ఒకరు ఆందోళనలకు మద్దతుగా తన ప్రొ÷ల్ పిక్‌ను మార్చుకున్నారు' అని సమాధానం ఇవ్వడం గమనార్హం. ఇదిలాఉంటే.. హసీనా తన పదవికి రాజీనామా చేసి, దేశం వదిలివెళ్లిపోవడం వెనక అమెరికా హస్తం ఉందనే అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈమేరకు ఆమె కొన్ని నెలల క్రితం నర్మగర్భంగా సంకేతాలిచ్చారనే ప్రచారం జరుగుతోంది. ఆమె ప్రభుత్వానికి అమెరికాతో సత్సంబంధాలు లేకపోవడాన్ని దీనికి ప్రధాన కారణమనే భావిస్తున్నారు.

# అద్వానీకి మరోమారు అస్వస్థత

**న్యూఢిల్లీ, ఆగస్ట్6 :** భాజపా సీనియర్ నేత, మాజీ ఉప ప్రధాని ఎల్‌కే ఆడ్వాణీ మరోమారు అనారోగ్యానికి గురయ్యారు. మంగళవారం ఆయనను దిల్లీలోని అపోలో ఆసుపత్రిలో చేర్చినట్లు సన్నిహిత వర్గాలు వెల్లడించాయి. ప్రస్తుతం ఆయన పరిస్థితి నిలకడగా ఉందని, వైద్యుల పర్యవేక్షణలో ఉన్నారని ఆసుపత్రి వర్గాలు వెల్లడించాయి. 96 ఏళ్ల ఆడ్వాణీ వృద్ధాప్య సమస్యలతో బాధపడుతున్నారు. జూన్ చివర్లో కూడా ఆయన అస్వస్థతకు గురవడంతో ఎయిమ్స్‌లో చేర్చారు. యూరాలజీ వైద్యులు ఆయనకు చికిత్స అందించారు. ఆ తర్వాత జులై మొదటివారంలో మరోసారి అనారోగ్యానికి గురవడంతో అపోలో ఆసుపత్రిలో రెండు రోజుల పాటు చికిత్స తీసుకున్నారు. నవంబరు 8న అవిభక్త భారత్‌లోని కరాచీలో జన్మించిన ఆడ్వాణీ సుదీర్ఘకాలం పాటు భాజపాలో పనిచేసి రాజకీయ కురువృద్ధుడిగా పేరుగాంచారు. ఈ ఏడాది కేంద్ర ప్రభుత్వం ఆయనను దేశ అత్యున్నత పౌరపురస్కారం 'భారతరత్న'తో సత్కరించిన సంగతి తెలిసిందే.

### మెడిసిన్ సీట్ల విషయంలో
# లోకల్ సమస్య
### తెలంగాణ విద్యార్థులకు అన్యాయం చేస్తారా
### ఎక్స్ వేదికగా ప్రభుత్వానికి కెటిఆర్ ప్రశ్న

**హైదరాబాద్, ఆగస్టు 6 (క్విక్ టుడే న్యూస్) :** మెడిసిన్ సీట్ల విషయంలో తెలంగాణ విద్యార్థులకు అన్యాయం చేస్తారా అని కాంగ్రెస్ సర్కార్‌ను బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రశ్నించారు. స్థానికత విషయంలో ప్రభుత్వం అనుసరిస్తున్న తీరు అనుమానాస్పదంగా కనిపిస్తున్నదని విమర్శించారు. జీవో 33 ప్రకారం నిర్దేశించిన స్థానికతలోని అంశాలు ప్రభుత్వం వేలితో విద్యార్థుల కళ్లను పొడిచినట్లే ఉన్నాయని ఎక్స్ వేదికగా ఆగ్రహం వ్యక్తంచేశారు. 9 నుంచి 12 తరగతి వరకు రాష్ట్రంలో చదివిన విద్యార్థులే స్థానికులు అవుతారని ప్రభుత్వం చెబుతున్నదని, దీని ప్రకారం చాలా మంది ఇతర రాష్ట్రాల విద్యార్థులే తెలంగాణలో లోకల్ అవుతారని చెప్పారు. హైదరాబాద్‌లో ప్రతిష్టాత్మక విద్యాసంస్థలు ఉన్నందున ఇతర రాష్ట్రాల కు చెందిన విద్యార్థుల చాలా మంది ఇక్కడే విద్యాభ్యాసం చేస్తున్నారని వెల్లడించారు. కొత్త నిబంధనల ప్రకారం వారంతా తెలంగాణలో లోకల్ అవుతారన్నారు. అదే విధంగా ఇతర రాష్ట్రాలలో చదివే మన విద్యార్థులు నాన్ లోకల్ అయ్యే ప్రమాదం ఉందని చెప్పారు. 2023–24 విద్యాసంవత్సరం వరకు 6 నుంచి 12 తరగతి వరకు నాలుగేండ్లు గరిష్టంగా ఎక్కడ చదివితే అదే స్థానికతగా గుర్తించాం. దాని కారణంగా మన విద్యార్థులు ఇంటర్మీడియేట్ కోసం ఇతర ప్రాంతాలకు వెళ్లినప్పటికీ వారు లోకల్‌గానే పరిగణించబడే వారు. తాజాగా ప్రభుత్వం చెబుతున్న కొత్త నిబంధనల ప్రకారమైతే వేలాది మంది ఇతర రాష్ట్రాల విద్యార్థులు తెలంగాణలో లోకల్ అవుతారు. దీంతో మన విద్యార్థులు మెడిసిన్ సీట్లు కోల్పోయే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తంచేశారు. ప్రభుత్వం వెంటనే ఈ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలన్నారు. తెలంగాణ విద్యార్థులకు అన్యాయం జరగకుండా.. గతంలో అనుసరించిన విధానాన్నే అనుసరించాలని డిమాండ్ చేశారు.

### తెలంగాణలో రెండురోజులు
# భారీ వర్షాలు
### హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడి

**హైదరాబాద్, ఆగస్టు 6 (క్విక్ టుడే న్యూస్) :** తెలంగాణలో రెండురోజులు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం పేర్కొంది. రానున్న మూడురోజుల్లో స్థిరమైన ఉపరితల గాలులు గంటకు 30–40 కిలోమీటర్ల వేగంతో పలుచోట్ల వీచే అవకాశం ఉందని తెలిపింది. మంగళవారం నుంచి బుధవారం వరకు భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట, మహబూబాబాద్, రంగారెడ్డి, నాగర్ కర్నూల్ జిల్లాల్లో అక్కడక్కడ భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని చెప్పింది. పలుచోట్ల తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురుస్తాయని అంచనా వేసింది. బుధవారం నుంచి గురువారం వరకు ఆదిలాబాద్, ఆసిఫాబాద్, మంచిర్యాల, వరంగల్, హన్మకొండ జిల్లాల్లో అక్కడక్కడ భారీ వర్షాలు కురిసే ఛాన్స్ ఉందని చెప్పింది. నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, భూపాలపల్లి, ములుగు, కొత్తగూడెం, ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట, మహబూబాబాద్, జనగా, సిద్దిపేట, యాదాద్రి భువనగిరి, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్, మల్కాజ్‌గిరి, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి జిల్లాల్లో అక్కడక్కడ వర్షాలు కురిసే అవకాశం ఉందని వివరించింది. ఈ మేరకు ఆయా జిల్లాలకు ఎల్లో అలెర్ట్‌ను జారీ చేసింది. హైదరాబాద్‌లో ఆకాశం సాధారణంగా మేఘావృతమై ఉంటుంది.. పలుచోట్ల మోస్తరు వర్షం కురిసే అవకాశం ఉందని తెలిపింది. ఇదిలా ఉండగా.. గడిచిన 24గంటల్లో నిజామాబాద్, వనపర్తి, మెదక్, నల్గొండ, వరంగల్, సిద్దిపేట, మహబూబాబాద్, కొత్తగూడెంతో పాటు పలు జిల్లాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిశాయి. అత్యధికంగా ఖమ్మం జిల్లా కొణిజెర్లలో 148 మిల్లీమీటర్లు, తల్లాడలో 120 మిల్లీమీటర్ల వర్షాపాతం నమోదైందని టీజీడీపీఎస్ పేర్కొంది.

# కేంద్ర ప్రభుత్వ పెన్షనర్ల దేశవ్యాప్త మహా ధర్నాలు



వి. కృష్ణ మోహన్
జాతీయ చైర్మన్, కేంద్ర ప్రభుత్వ గెజిటెడ్ ఆఫీసర్స్ ఆర్గనైజేషన్స్ కాన్ఫెడరేషన్ (సీసీజీజీఓఓ)
9182189533, 9440668281 హైదరాబాద్

**వైద్య బీమా పథకాన్ని వెంటనే ప్రారంభించాలని,110వ పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ సిఫార్సుల ప్రకారం ఫిక్స్‌డ్ మెడికల్ అలవెన్స్ ను రూ.1000/- నుండి రూ.3000/- కు పెంచాలని ఎన్సీసీపీఏ సెక్రటరీ జనరల్ కె. రాఘవేంద్రన్ చెన్నై ధర్నాలో డిమాండ్ చేశారు. ఈశాన్య రాష్ట్రాల్లో కేవలం గౌహతిలో మాత్రమే ఏడీ ఆఫీసు ఉండటంతో ఉద్యోగులు, పెన్షనర్లు ఎన్నో అగచాట్లకు గురవుతున్నారని, దేశంలోని అన్ని జిల్లాల్లో సీజీహెచ్ఎస్ వెల్‌నెస్ సెంటర్లను, అన్ని రాష్ట్ర కేంద్రాల్లో ఏడీ ఆఫీసులను ఏర్పాటు చేయాలని అసోం ధర్నాలో ఏఐపీఆర్ పీఏ ప్రధాన కార్యదర్శి ద్విజేంద్ర దేబ్ నాథ్ డిమాండ్ చేశారు.**




కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల, పెన్షనర్ల వైద్య సౌకర్యాలలో కోత విధింపును నిరసిస్తూ ఆరోగ్య పథకాలను మెరుగు పరచాలని డిమాండ్ చేస్తూ వేలాది రైల్వే, డిఫెన్స్, పోస్టల్, బిఎస్ఎన్ఎల్, పారామిలిటరీ తదితర పెన్షనర్లు నేషనల్ కో ఆర్డినేషన్ కమిటీ ఆఫ్ పెన్షనర్స్ అసోసియేషన్స్ (ఎన్సీసీపీఏ) పిలుపు మేరకు దేశవ్యాప్తంగా కేంద్ర ప్రభుత్వ ఆరోగ్య పథకం (సీజీహెచ్ఎస్) అదనపు డైరెక్టర్ (ఏడీ) కార్యాలయాల ఎదుట మంగళవారం భారీ ధర్నాలు నిర్వహించి ప్రధాన మంత్రి తదితరులకు వినతి పత్రాలు సమర్పించారు. హైదరాబాద్ బేగంపేటలో వందలాది రిటైర్డ్ ఉద్యోగులు పాల్గొన్న ధర్నాలో ఎన్సీసీపీఏ డిప్యూటీ సెక్రటరీ జనరల్ పాలకుర్తి కృష్ణమూర్తి సీజీహెచ్ఎస్ ఎంప్యానెల్డ్ ఆసుపత్రుల్లో నగదు రహిత చికిత్స అందించాలని, అదనపు మొత్తాలను డిమాండ్ చేసే విధానం రద్దు చేయాలని డిమాండ్ చేశారు. సీజీహెచ్ఎస్ వెల్నెస్ సెంటర్లను పబ్లిక్ ప్రైవేట్ పార్టనర్‌షిప్ (పీపీపీ) పద్ధతిపై ప్రైవేటీకరణ ప్రతిపాదనను విరమించుకోవాలని టాప్రా నాయకులు ఎన్. సోమయ్య విజ్ఞప్తి చేశారు. సీజీహెచ్ఎస్ కు ఉద్యోగులు ప్రతి నెలా తమ జీతంలో చందా చెల్లిస్తున్నారని, రిటైరైన తర్వాత కూడా 120 నెలల సబ్స్క్రిప్షన్ చెల్లించారని కానీ ఇప్పుడు ఆయుష్మాన్ భారత్ తో లింక్ చేసి వైద్య సౌకర్యాలను కుదించాలనే నిర్ణయాన్ని రద్దు చేయాలని సీసీజీజీఓఓ జాతీయ చైర్మన్ వి. కృష్ణ మోహన్ కోరారు. రైల్వే ఆసుపత్రులలో, సీజీహెచ్ఎస్ లో నిపుణులైన వైద్యులను, పారా మెడికల్ మరియు ఇతర సిబ్బందిని వెంటనే నియమించాలని ఏఐఆర్ఆర్ఎఫ్ నాయకులు స్వామి కోరారు.

విశాఖపట్నం డాబా గార్డెన్స్ సెంటర్ లో వందలాది రిటైర్డ్ ఉద్యోగులు పాల్గొన్న ధర్నాలో ఏసీజీఈపీఏ ప్రధాన కార్యదర్శి యం. చంద్రశేఖర రావు మాట్లాడుతూ రాష్ట్ర విభజన జరిగి దశాబ్దమైనా ఆంధ్రప్రదేశ్ లో సీజీహెచ్ఎస్ ఏడీని నియమించకపోవటంతో, సెంట్రల్ అడ్మినిస్ట్రేటివ్ ట్రిబ్యునల్ (కాట్) బెంచ్ ను ఏర్పాటు చేయకపోవడంతో ప్రతి చిన్న విషయానికి విశాఖపట్నం నుంచి హైదరాబాద్ వెళ్లి ఎదురు చూస్తూ ఉండాల్సి వస్తుందని వాపోయారు. గుంటూరులో పెన్షనర్ల కార్యదర్శి నాగేశ్వరరావు ధర్నాలో ప్రసంగిస్తూ డాక్టర్లు సూచించిన మందులన్నింటిని ఒకేసారి సరఫరా చేయాలని, చికిత్స మరియు రోగనిర్ధారణ పరీక్షల రేట్లను కాలానుగుణంగా సవరించాలని సూచించారు.

వైద్య బీమా పథకాన్ని వెంటనే ప్రారంభించాలని,110వ పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ సిఫార్సుల ప్రకారం ఫిక్స్‌డ్ మెడికల్ అలవెన్స్ ను రూ.1000/- నుండి రూ.3000/- కు పెంచాలని ఎన్సీసీపీఏ సెక్రటరీ జనరల్ కె. రాఘవేంద్రన్ చెన్నై ధర్నాలో డిమాండ్ చేశారు. ఈశాన్య రాష్ట్రాల్లో కేవలం గౌహతిలో మాత్రమే ఏడీ ఆఫీసు ఉండటంతో ఉద్యోగులు, పెన్షనర్లు ఎన్నో అగచాట్లకు గురవుతున్నారని, దేశంలోని అన్ని జిల్లాల్లో సీజీహెచ్ఎస్ వెల్‌నెస్ సెంటర్లను, అన్ని రాష్ట్ర కేంద్రాల్లో ఏడీ ఆఫీసులను ఏర్పాటు చేయాలని అసోం ధర్నాలో ఏఐపీఆర్ పీఏ ప్రధాన కార్యదర్శి ద్విజేంద్ర దేబ్ నాథ్ డిమాండ్ చేశారు. స్వయం ప్రతిపత్తి గల సంస్థలలో, చట్టబద్ధమైన సంస్థల్లో మరియు ఎన్ఐఏ జైపూర్‌లో పదవీ విరమణ పొందిన వారికి సీజీహెచ్ఎస్ ద్వారా వైద్య చికిత్సలు అందించాలని ఎన్సీసీపీఏ వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీ కృష్ణ శర్మ రాజస్థాన్ ధర్నాలో కోరారు. ఏడవ సీపీసీ నోషనల్ పే స్ట్రక్చర్ ఆధారంగా వార్డులు కేటాయించాలని, సర్వీసు కాల పరిమితితో సంబంధం లేకుండా ఎన్ పీఎస్ కింద రిటైరైన వారందరినీ సీజీహెచ్ఎస్ లో చేరడానికి అనుమతించాలని ఏఐబిడీపీఏ ప్రధాన కార్యదర్శి కే.జీ. జయరాజ్ తిరువనంతపురం ధర్నాలో విజ్ఞప్తి చేశారు. దేశవ్యాప్తంగా వేలాదిమందితో జరిగిన ధర్నాల్లో నాయకులు న్యాయబద్ధమైన సమస్యలను పరిష్కరించనట్లైతే దశలవారీగా ఆందోళనలను ఉధృతం చేస్తామని, ఐక్య ఉద్యమాలతో కలిసికట్టుగా పోరాడి సమస్యలను పరిష్కరించుకుందామని పిలుపునిచ్చారు.

# ఆందోళనల మాటున హిందూ ఆలయాల ధ్వంసం

### బంగ్లా ఘటనలపై సర్వత్రా ఆందోళన



**ఢాకా, అగస్ట్6 :** ఉద్యోగాల్లో రిజర్వేషన్ల వ్యతిరేక ఆందోళనలతో బంగ్లాదేశ్‌లో రాజకీయ అస్థిరత ఏర్పడింది. ప్రజా ఉద్యమానికి జడసి ప్రధాని షేక్ హసీనా తన పదవికి రాజీనామా చేశారు. దీంతో రంగంలోకి దిగిన ఆర్మీ తాత్కాలిక ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించింది. కాగా, రిజర్వేషన్ల ఆందోళనల మాటున దేశంలో హిందూ ఆలయాలపై దుండగులు దాడులకు పాల్పడుతున్నారు. ఇందులో భాగంగా ఖుల్నా డివిజన్‌లోని మెహర్‌పూర్‌లో ఉన్న ఇస్కాన్ టెంపుల్‌పై దాడిచేశారు. ఆలయాన్ని ధ్వంసం చేసిన గుర్తుతెలియని వ్యక్తులు.. విగ్రహాలను పగులగొట్టారు. ఆ ప్రతిమలను కాల్చివేశారు.దేశంలో కొన్ని రోజులుగా కొనసాగుతున్న అల్లర్లు పతాక స్థాయికి చేరడంతో ప్రధాని పదవికి షేక్ హసీనా రాజీనామా చేశారు. ఉద్యోగాల్లో రిజర్వేషన్లు కల్పించేందుకు ఆమె చేసిన ప్రయత్నానికి వ్యతిరేకంగా మొదలైన ఉద్యమం చివరకు ఆమెనే గద్దె దింపింది. ప్రపంచంలోనే ఎక్కువ కాలం ప్రభుత్వాధినేతగా పనిచేసిన మహిళగా ఘనత వహించిన హసీనా ప్రజా ఉద్యమానికి జడిసి పదవిని వదులుకున్నారు. ఎన్నికల్లో తిరుగులేని ప్రజాతీర్పుతో అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లోనే అవమానకర రీతిలో దేశాన్ని వీడి పరారయ్యారు. భారత్ చేరుకున్న ఆమె మరికొన్నిరోజుల పాటు ఇక్కడే ఉండనున్నట్లు తెలుస్తున్నది. రాజకీయ శరణార్థిగా యూకే ఆశ్రయం కోరినట్లు తెలుస్తున్నది. దీనిపై యూకే ప్రభుత్వం నుంచి అనుమతి రాగానే అక్కడికి వెళ్లనున్నారు. కాగా, రహస్య ప్రదేశంలో ఉన్న హసీనాను.. జాతీయ భద్రతా సలహాదారు అజీత్ దోభాల్ కలిశారు.

# వారణాసిలో కుప్పకూలిన రెండు ఇళ్లు

### ఓ మహిళ మృతి..శిథిలాల కింద మరో ఏడుగురు



వారణాసి,ఆగస్ట్6(ఆర్ఎన్ఎ): ఉత్తరప్రదేశ్‌లోని వారణాసిలో ఉన్న కాశీ విశ్వనాథ ఆలయం సమీపంలో మంగళవారం ఉదయం రెండు ఇళ్లు కూలిపోయాయి. ఈ ఘటనలో ఓ మహిళ మృతి చెందగా.. మరో ఎనిమిది మంది తీవ్రంగా గాయపడ్డారు. సమాచారం అందుకున్న పోలీసులు, నేషనల్ డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్ (ఎన్‌డీఆర్ఎఫ్), వైద్యులు, డాగ్ స్క్వాడ్‌తో కూడిన బందం వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. శిథిలాల కింద చిక్కుకున్న 8 మందిని బయటకు తీశారు. తెల్లవారుజామున 3గంటలకు ఒక ఇళ్లు కూలిపోగా..ఆ వెంటనే దాని పక్కనున్న మరో ఇళ్లు కుప్పకూలినట్టు స్థానికులు తెలిపారు. ప్రమాదం తర్వాత మైదాగిన్, గొదౌలియా నుంచి కాశీ విశ్వనాథ ఆలయానికి వెళ్లే రహదారిని మూసివేశారు. నగరంలో భారీ వర్షం కారణంగానే ఇళ్లు కూలిపోయాయని పోలీసులు వెల్లడించారు. ఈ ఘటనపై సీఎం యోగీ ఆధిత్య నాథ్ స్పందించారు. క్షతగాత్రులకు మెరుగైన చికిత్స అందించాలని ఆదేశాలు జారీ చేశారు. సోమవారం అర్ధరాత్రి 2 గంటల సమయంలో నేలమట్టం అయ్యాయి. ఇళ్లు కూలిపోయామని సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే అక్కడికి చేరుకున్నారు. సహాయక చర్యల్లో ఆరోగ్యశాఖ, డాగ్ స్క్వాడ్, ఎన్డీఆర్ఎఫ్ బృందాలు పాల్గొన్నాయి. చౌక్ పోలీస్ స్టేషన్ ఏరియాలో గల ఖోవా గలిలో ఉన్న రెండు గృహాలు ఒక్కసారిగా కూలిపోయాయి. అర్ధరాత్రి సమయం కావడంతో ఇళ్లలో ఉన్నవారు గాఢ నిద్రలో ఉన్నారు. శిథిలాల కింద ఎనిమిది మంది చిక్కుకున్నారని ప్రాథమికంగా అధికారులు వివరించారు. వారిలో ఓ పోలీసు కానిస్టేబుల్ కూడా ఉన్నారు. ముగ్గురిని శిథిలాల నుంచి బయటకు తీశారు. వారిని చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. మరో ఐదుగురు శిథిలాల కింద ఉన్నారు. వారిని వెలికితీసే ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఇంకా ఎవరైనా చిక్కుకొని ఉన్నారా అని పరిశీలిస్తున్నారు. ఇళ్లు కూలిపోవడానికి గల కారణాలు తెలియరాలేదు.

# న్యాయవాదుల తీరుపై సీజేఐ చంద్రచూడ్ అసహనం

### ఎంత ఒత్తిడితో పనిచేస్తున్నామో గమినించారా


### అందరూ తమకేసులే ముందంటే ఎలా అని ప్రశ్న

**న్యూఢిల్లీ, అగస్ట్ 6 :** న్యాయవాదులపై సీజేఐ చంద్రచూడ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. పలువురు సుప్రీంకోర్టు న్యాయవాదులపై ప్రధాన న్యాయమూర్తి తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. కోర్టులు, న్యాయ మూర్తులపై ఎంత ఒత్తిడి ఉందో కనీసం అర్థం చేసుకోవాలని సీజేఐ అన్నారు. న్యాయవాదులు ఒక రోజు సీజేఐ స్థానంలో కూర్చుంటే ఎంత ఒత్తడితో పని చేస్తున్నామో అన్న విషయం తెలుస్తుందని చంద్రచూడ్ అన్నారు. ఒక్కరోజు తమ స్థానంలో కూర్చుంటే.. మళ్లీ జీవితంలో ఆ స్థానంలోకి రాకుండా పారిపోతారని సీజేఐ వ్యాఖ్యానించారు. ఈ క్రమంలో పలువురు న్యాయవాదుల తీరుపై భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డి.వై.చంద్రచూడ్ తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. ప్రతిఒక్కరూ తమ కేసు ముందుగా విచారణ చేపట్టాలని కోరుతున్నారు గానీ.. న్యాయమూర్తుల మీద ఉన్న ఒత్తిడిని ఎవరూ పట్టించుకునే పరిస్థితుల్లో లేరన్నారు. మహారాష్ట్ర ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ శిందే వర్గానికి చెందిన ఎమ్మెల్యేలపై అనర్హత వేసేందుకు స్పీకర్ నిరాకరించడాన్ని సవాల్ చేస్తూ శివసేన (యూబీటీ) సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. అయితే, మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో దీనిపై ముందస్తు విచారణ చేపట్టాలని కౌన్సిల్ ధర్మాసనానికి అభ్యర్థించింది. అయితే, దీనికి సంబంధించిన పత్రాలు అందించేందుకు సమయం కావాలని ప్రతివాదులు కోరడంతో వచ్చే వారానికి వాయిదా వేసింది. దీంతో పిటిషనర్ తరఫు న్యాయబృందం అభ్యంతరం వ్యక్తంచేసింది. అంతకంటే ముందుగానే పిటిషన్‌ను విచారించాలని కోరింది. దీంతో సీజేఐ జస్టిస్ డి.వై.చంద్రచూడ్ ఆగ్రహానికి గురయ్యారు. ముంబై చెంబుర్ కాలేజిలో విద్యార్థినిలు బురఖా, హిజాబ్ రద్దు చేసిన వ్యవహారంపై విచారణ సందర్భంగా సీజేఐ ఈ వ్యాఖ్యలు చేశారు. ప్రతి ఒక్కరూ తమ కేసు ముందుగా విచారణ చేపట్టాలని కోరుతున్నారని... కానీ న్యాయమూర్తుల మీద ఉన్న ఒత్తిడిని ఎవరూ పట్టించుకునే పరిస్థితుల్లో లేరని తెలిపారు. ప్రతి ఒక్క పిటిషన్‌పై విచారణ చేస్తామని.. దానికి ఒక తేదీని ఇస్తామన్నారు. ఆ విషయాన్ని అర్థం చేసుకోవాలి కానీ న్యాయమూర్తులను, కోర్టును శాసించవద్దు అని జస్టిస్ చంద్రచూడ్ తెలిపారు. దీనిపై కొందరు విద్యార్థులు బాంబే హైకోర్టును ఆశ్రయించగా.. జోక్యం చేసుకోవడానికి నిరాకరించింది. న్యాయమూర్తులు ఎఎస్ చందూర్కర్, రాజేష్ పాటిల్‌లతో కూడిన డివిజన్ బెంచ్ కళాశాల తీసుకున్న నిర్ణయంలో జోక్యం చేసుకోబోమని తెలిపారు. విద్యార్థులు హిజాబ్, నఖాబ్, బుర్కా, స్టోల్స్, క్యాప్‌లు, బ్యాడ్జీలు ధరించరాదని డ్రస్ కోడ్ విధిస్తూ చెంబూర్ ట్రాంబే ఎడ్యుకేషన్ సొసైటీ ఎన్‌జీ ఆచార్య, డీకే మరాఠే ఆదేశాలు జారీ చేశారు. ఈ ఆదేశాలను సవాలు చేస్తూ విద్యార్థులు ఈ నెల ప్రారంభంలో ముంబై హైకోర్టును ఆశ్రయించారు. తమ మతాచారాలను పాటించడం తమ ప్రాథమిక హక్కు అని కానీ చెంబూర్ ట్రాంబే కాలేజ్ నిర్ణయం దీనికి విరుద్ధమని పిటిషనర్లు పేర్కొన్నారు. నఖాబ్, బుర్కా, హిజాబ్‌లపై ఉన్న పరిమితిని ఉపసంహరించుకోవాలని వారు మొదట కళాశాల యాజమాన్యాన్ని, ప్రిన్సిపాల్‌ను అభ్యర్థించారు. అయితే కాలేజీ యాజమాన్యం మాత్రం వివక్ష లేకుండా పౌరులందరికీ విద్యను అందించాలనే స్ఫూర్తిని పెంపొందించడానికి ఈ నిర్ణయం తీసుకున్నట్టు తెలిపింది. బాంబే హైకోర్టు జోక్యం చేసుకోవడానికి నిరాకరించడంతో సుప్రీంకోర్టును ఆశ్రయించారు.

# ఎస్సీ వర్గీకరణ తీర్పు దారుణం

### దేశ సమగ్రతకు విరుద్ధంగా తీర్పు

### మాజీ కేంద్రమంత్రి చింతామోహన్ ఆగ్రహం



**న్యూఢిల్లీ, ఆగస్ట్6 :** ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును మాజీ కేంద్రమంత్రి చింతా మోహన్ తప్పు పట్టారు. ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు తీర్పు రాజ్యాంగ విరుద్ధమని, దేశ సమగ్రతకు విరుద్ధంగా సుప్రీం కోర్టు తీర్పు ఉందని చింతా మోహన్ విమర్శించారు. ఈ సందర్భంగా మంగళవారం ఆయన ఢిల్లీలో మీడియాతో మాట్లాడుతూ.. సుప్రీం తీర్పు భారత అఖండతను దెబ్బతీసేలా ఉందని, దేశ పౌరుడిగా ధర్మాసనం తీర్పును వ్యతిరేకిస్తున్నానని అన్నారు. సుప్రీంకోర్టు న్యాయమూర్తులకు దేశం పేదరికం, కులాల గురించి తెలుసా అని ప్రశ్నించారు. సుప్రీంకోర్టులో ఉన్న న్యాయమూర్తులు సంపన్నులని, వారు పేద వర్గాల గురించి తీర్పు ఇస్తారా అని చింతా మోహన్ ప్రశ్నించారు. సుప్రీంకోర్టు న్యాయమూర్తులు ఎప్పుడన్న దళిత వాడల్లో తిరిగారా అని నిలదీశారు. ఎస్సీ వర్గీకరణపై న్యాయస్థానం అనాలోచిత, తల తిక్క తీర్పు ఇచ్చిందన్నారు. దేశంలో వెయ్యి ఉపకులాలు ఉన్నాయని.. ఎలా వర్గీకరణ చేస్తారని అన్నారు. వర్గీకరణపై కమిషన్ వేయాలని, కేంద్ర ప్రభుత్వానికి.. రాష్ట్రాలకు తలకాయ లేదని ఎద్దేవా చేశారు. సుప్రీంకోర్టు న్యాయమూర్తుల ఎంపికలో క్రిమిలేయర్ ఉందా అని ప్రశ్నించారు. సుప్రీంకోర్టులో 34 మంది జడ్జీలు ఉంటే.. అందులో దక్షిణాది రాష్ట్రాల నుంచి ఉండేది ఐదుగురేనా?.. మిగిలినవారు ఉత్తర భారత దేశం నుంచి వస్తారా? అని చింతా మోహన్ ప్రశ్నించారు. దక్షిణాది రాష్ట్రాల నుంచి ఐదుగురు న్యాయమూర్తులు ఉన్నారని, ఢిల్లీ, ముంబై నుంచి 10 మంది న్యాయమూర్తులు ఉంటారా? అన్నారు. ఇది క్రిమిలేయరా ఇక్కడ వర్గీకరణ ఉందన్నారు. దేశ సమైక్యతను దెబ్బతీసేవిధంగా ప్రధాని మోదీ నిర్ణయాలు తీసుకోవద్దని సూచించారు. రిజర్వేషన్లు జోలికి మోదీ వెళ్ళారని, షేక్ హసీనాకు పట్టిన గతి పట్టకుండా కేంద్రం రిజర్వేషన్ల జోలికి వెళ్ళొద్దని చింతా మోహన్ మరొకసారి సూచించారు.

# వైసీపీపాలనలో ఏపీ అప్పులపాలు

### ఏపీ పునర్నిర్మాణానికి కేంద్రం చేయూత

### ఆర్థిక బిల్లుపై చర్చలో లావు కృష్ణదేవరాయలు

న్యూఢిల్లీ,ఆగస్ట్6(ఆర్ఎన్ఎ): వైసీపీపాలనలో ఏపీ అప్పులపాలైందని తెలుగుదేశం పార్లమెంటరీ పార్టీ నేత లావు శ్రీ కృష్ణదేవరాయలు విమర్శించారు. అప్పుల భారం రాష్ట్రానికి గుదిబండగా మారిందన్నారు. మంగళవారం ఆయన ఆర్థిక బిల్లుపై చర్చ సందర్భంగా మాట్లాడుతూ.. మాజీ సీఎం జగన్ చేసిన అప్పులను పునర్వ్యవస్థీకరించాలని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఏపీ ఆర్థిక పరిస్థితిపై వివరాలను ఆయన సభ దృష్టికి తీసుకువచ్చారు.'ఏపీలో రెవెన్యూ లోటు, అప్పుల భారం అధికంగా ఉంది. ఏపీపీ పునర్మిర్మాణానికి కేంద్రం చేయూత అందించాలి. ఆంధ్రప్రదేశ్ ఆర్థిక పరిస్థితిపై రాష్ట్ర ప్రభుత్వం శ్వేతపత్రం విడుదల చేసింది. పార్లమెంటు సభ్యులందరికి ఏపీ ఆర్థిక పరిస్థితికి సంబంధించిన శ్వేతపత్రాలు ఇవ్వబోతున్నాం. రాష్ట్ర ఖర్చులు రూ.1.64లక్షల కోట్లు ఉండగా, రెవెన్యూ కేవలం రూ.1.45లక్షల కోట్లు మాత్రమే ఉంది. ఈ ఆర్థిక సంవత్సరంలో రూ. 19వేల కోట్ల లోటు స్పష్టంగా కనిపిస్తోంది. అప్పు 2019లో రూ. 3.75 లక్షల కోట్లు ఉంటే... అది 2024కి రూ. 9.74 లక్షల కోట్లకు చేరింది. గత ఐదేళ్ళలో13.5 శాతం నుంచి 10.5 శాతానికి వృద్ధి రేటు పడిపోయింది. వ్యవసాయ రంగం 16 శాతం నుంచి 10 శాతానికి దిగజారింది. మూలధన పెట్టుబడి వ్యయం 2014 నుంచి 2019 మధ్య రూ.60 వేల కోట్లు ఉండగా, గత ఐదేళ్లలో అది రూ.24 వేల కోట్లకు పరిమితమైంది. వైసీపీ పాలనలో రాష్ట్రం అన్ని రంగాల్లో వెనుకబడింది. వృద్ధి రేటు దిగజారిపోయింది. వైసీపీ ప్రభుత్వం విచ్చలవిడి అప్పుల కారణంగా... రాష్ట్ర తలసరి అప్పు రెట్టింపు అయ్యింది. రాష్ట్రంలో ఒక్కొక్కరిపై తలసరి అప్పు రూ. 74 వేల నుంచి రూ. 1.44 లక్షలకు చేరింది. ద్రవ్యోల్బణం 4.5 శాతం నుంచి 6 శాతాన్ని మించి పోయింది. ఆర్థిక పరిస్థితిని దృష్టిలో పెట్టుకుని కేంద్ర ఆర్థిక శాఖ ఏపీపై ప్రత్యేక దృష్టి సారించాలి. మిగిలిన రాష్ట్రాలతో ఆర్థిక వృద్ధి సాధించేందుకు సాయపడాలి. రాష్ట్ర పునర్నిర్మాణం కోసం కేంద్రంతో కలిసి పని చేస్తాం. దీర్ఘకాలిక క్యాపిటల్ గెయిన్స్‌పై పన్ను విధించే విషయంలో కేంద్రం పునరాలోచించాలి. ఆరోగ్య, బీమా పాలసీలపై విధిస్తున్న 18 శాతం జీఎస్టీని పూర్తిగా తీసివేయాలి.

# జయశంకర్ సార్‌కు బీఆర్ఎస్ నివాళి

### గత స్మృతులను నెమరేసుకున్న నేతలు



**హైదరాబాద్, అగస్ట్6 :** తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ప్రొఫెసర్ జయశంకర్ సార్ తన జీవితాన్ని ధారబోసారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. తెలంగాణ ఉద్యమ భావజాల వ్యక్తికి సార్ చేసిన కృషి అనిర్వచనీయమని చెప్పారు. స్వరాష్ట్ర సాధనలో దిక్సూచిగా నిలిచిన వారి కీర్తి అజరామరమని, స్ఫూర్తి మరచిపోలేనిదని తెలిపారు. తెలంగాణ సిద్ధాంతకర్త ప్రొఫెసర్ జయశంకర్ సార్ జయంతి సందర్భంగా ఆయనకు కేటీఆర్ ఘనంగా నివాళులర్పించారు. పుట్టుక మీది.. చావు మీది.. బతుకంతా తెలంగాణది అని కీర్తించారు. ప్రొఫెసర్ జయశంకర్ సార్ జయంతి సందర్భంగా బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్ రావు ఘనంగా నివాళులర్పించారు. తెలంగాణ స్వరాష్ట్ర స్వాప్నికుడు, సిద్ధాంతకర్త, ఉద్యమ భావజాల వ్యాప్తికి జీవితాంతం కృషి చేసిన మహనీయులని చెప్పారు. ఆయన చూపిన మార్గంలో, కేసీఆర్ సారథ్యంలో తెలంగాణ రాష్ట్రం సాకారమైందన్నారు. తెలంగాణ ఉద్యమ చరిత్రలో జయశంకర్ సార్‌ది ప్రత్యేక స్థానమని వెల్లడించారు. జయహో జయశంకర్ సర్.. పిడికిలెత్తి పలుకుతోంది తెలంగాణ జోహార్ అంటూ సామాజిక మాధ్యమం ఎక్స్‌లో పోస్టు చేశారు. ఇక జయశంకర్ సార్ జయంతిని హైదరాబాద్ తెలంగాణ భవన్‌లో ఘనంగా నిర్వహించారు. ప్రొఫెసర్ జయశంకర్ విగ్రహానికి మండలిలో బీఆర్ఎస్ ఎల్పీ నేత మధుసూదనా చారి, ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్, మాజీ మంత్రులు నిరంజన్ రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, పార్టీ నేతలు దేవీ ప్రసాద్, వాసుదేవ రెడ్డి తదితరులు పూలమాల వేసి నివాళులర్పించారు.






## బాలకృష్ణ సరసన ముగ్గురు హీరోయిన్లు

స్టార్ హీరో బాలకృష్ణకు ఉన్న ఫాలోయింగ్ అంతాఇంతా కాదు. ఆయన సినిమాల గురించి ఏ అప్‌డేట్స్ వచ్చినా అవి క్షణాల్లో వైరల్‌గా మారతాయి. ప్రస్తుతం వరుస సినిమాలతో బిజీగా ఉన్న బాలయ్య పేరు సోషల్ మీడియాలో ట్రెండ్ అవుతోంది. ఆయన సినిమాలకు సంబంధించిన కొన్ని వార్తలు తెగ షేర్ అవుతున్నాయి. బాలకృష్ణ -బాబీ కాంబినేషన్‌లో ఓ సినిమా (ఎన్‌బికె109) తెరకెక్కుతోన్న విషయం తెలిసిందే. ఈ చిత్రానికి సంబంధించిన ఒక వార్త నెట్టింట సందడి చేస్తోంది. ఇందులో బాలకృష్ణ సరసన ముగ్గురు హీరోయిన్లు నటించనున్నట్లు తెలుస్తోంది. ఊర్వశీ రౌతేలా, ప్రగ్యా జైస్వాల్, శ్రద్ధా శ్రీనాథ్ ఇందులో కీలకపాత్రల్లో కనిపించనున్నారని టాక్ వినిపిస్తోంది. ఇదే నిజమైతే బాలయ్య సరసన ప్రగ్యాలను తెరపై రెండోసారి చూడొచ్చని అభిమానులు అనుకుంటున్నారు. ఇందులో బాబీదేవోల్ విలన్‌గా కనిపించ నున్నారు. మాస్ యాక్షన్ కథాంశంతో రూపొందుతోన్న ఈ సినిమాలో బాలయ్య రెండు కోణాలున్న పాత్రలో కనువిందు చేయనున్నట్లు తెలుస్తోంది. చాలా సంవత్సరాల తర్వాత ఆయన క్లాసీ లుక్‌లో కనిపించనున్నారట. అలాగే దీనిలో పొలిటికల్ బ్యాక్‌డ్రాప్ నేపథ్యం ఉంటుందని టాక్. ఈ ఏడాది సూపర్ హిట్‌ను సొంతం చేసుకున్న చిత్రాల్లో ఫహద్ ఫాజిల్ నటించిన 'ఆవేశం' ఒకటి. జీతూ మాధవన్ దర్శకత్వంలో రూపొందిన ఈ చిత్రం మంచి కలెక్షన్లు సొంతం చేసుకుంది. కేవలం రూ.30 కోట్లతో నిర్మించిన ఈ యాక్షన్ కామెడీ ఫిల్మ్ ప్రపంచవ్యాప్తంగా రూ.150కోట్లు వసూలుచేసింది. ఇప్పుడీ చిత్రాన్ని బాలకృష్ణ రీమేక్ చేయనున్నట్లు వార్తలు వస్తున్నాయి. ఈ సినిమా హక్కులను కూడా టాలీవుడ్‌కు చెందిన ఓ ప్రముఖ నిర్మాణ సంస్థ కొనుగోలు చేసినట్లు టాక్ వినిపిస్తోంది. దీనికి సంబంధించిన అధికారిక సమాచారం త్వరలోనే రానున్నట్లు తెలుస్తోంది.

## మెగా ఫ్యామిలీ జోరు మీదుంది: నీహారిక

ఈ ఏడాది మెగా కుటుంబానికి అద్భుతంగా ఉందని మెగా డాటర్ నిహారిక కొణిదెల అన్నారు. ఆమె నిర్మాతగా వ్యవహరించిన చిత్రం 'కమిటీ కుర్రోళ్లు' కొత్త నటులతో దర్శకుడు యదువంశీ తెరకెక్కించారు. ఆగస్టు 9న ఈ సినిమా ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సందర్భంగా చిత్రబృందం ప్రీ రిలీజ్ ఈవెంట్‌ను ఘనంగా నిర్వహించారు. ఈ వేదికపై నిహారిక మాట్లాడుతూ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. 'ఈ సంవత్సరం మా కుటుంబానికి అద్భుతంగా ఉంది. మా చరణ్ అన్న సినిమా ఆస్కార్స్‌కు వెళ్లింది. మా పెదనాన్నకు (చిరంజీవి) పద్మవిభూషణ్ వచ్చింది. మా బాబాయి (పవన్ కల్యాణ్) డిప్యూటీ సీఎం అయ్యారు. అలాగే నేను కూడా నిర్మాతగా నా ఫస్ట్ సినిమాతో వస్తున్నాను. ఇలానే మీ అందరూ ఆదరిస్తారని ఆశిస్తున్నా' అని అన్నారు. 'మా అన్నయ్య వరుణ్‌తేజ్ నాకెప్పుడు సపోర్ట్ చేస్తూ నా వెంటే ఉంటాడు. ప్రపంచంలో అందరూ బాగుండాలని కోరుకునే మా బావ సాయిధరమ్ తేజ్ ఈ వేదికపై ఉండడం చాలా ఆనందంగా ఉంది. ఈ చిత్రం తర్వాత దర్శకుడు వంశీ పేరు ఇండస్ట్రీలో గట్టిగా వినిపిస్తుంది. ప్రేక్షకులకు పరిచయం ఉన్న నటీనటులను పెట్టాలి అని అనుకున్నా. కొత్తవారితో చేద్దామని వంశీ అన్నారు. కానీ, ఇప్పుడు 15 మంది టాలెంట్ ఉన్న కొత్త యాక్టర్స్‌ను ఇండస్ట్రీకి ఇచ్చాననే తృప్తిని మీరు నాకు ఇచ్చారు. సాయి కుమార్ ఈ సినిమాకు ప్రత్యేక ఆకర్షణ. ఆగస్టు 9న ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు వస్తుంది. ఈ ఏడాది సక్సెస్‌లాగే సినిమాను కూడా హిట్ చేయాలని కోరుతున్నా. మీ అందరికీ నచ్చుతుందని నాకు పూర్తి నమ్మకం ఉంది. ఇది అతి విశ్వాసం కాదు' అని అన్నారు.






## ఎన్టీఆర్.. ప్రశాంత్ నీల్ మూవీకి 9న ముహూర్తం

జూనియర్ ఎన్టీఆర్ ప్రస్తుతం పాన్ ఇండియా ప్రాజెక్ట్ దేవరతో ఫుల్ బిజీగా ఉన్న విషయం తెలిసిందే. ఇప్పటికే విడుదల చేసిన చుట్టమల్లె సాంగ్ నెట్టింటిని షేక్ చేస్తోంది. సెప్టెంబర్ 27న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదల కానుంది. ఇదిలా ఉంటే తారక్ మరోవైపు ప్రశాంత్ నీల్ డైరెక్షన్‌లో ఎన్టీఆర్ 31 కు కూడా గ్రీన్ సిగ్నల్ ఇచ్చాడని ప్రత్యేకించి చెప్పనవసరం లేదు. చాలా రోజుల తర్వాత తాజాగా ఈ భారీ సినిమాకు సంబంధించిన వార్త ఒకటి నెట్టింట వైరల్ అవుతూ అభిమానులను ఖుషీ చేస్తోంది. తారక్ ఎన్టీఆర్ 31 సినిమా లాంచింగ్‌కు ముహూర్తం ఖరారైంది. ఈ మూవీని ఆగస్టు 9న ఘనంగా ప్రారంభించేందుకు రెడీ అయ్యారు మేకర్స్. ప్రశాంత్ నీల్ ప్రాజెక్ట్‌కు డ్రాగన్ అనే టైటిల్‌ను పరిశీలిస్తున్నట్టు ఇప్పటికే ఆన్‌లైన్‌లో వార్తలు హల్ చల్ చేస్తున్నాయి. ఇక ప్రశాంత్ నీల్ సలార్‌తో బాక్సాఫీస్‌ను షేక్ చేశాడని తెలిసిందే. ప్రస్తుతానికి ఈ ఫ్రాంచైజీ ప్రాజెక్ట్ సీక్వెల్ సలార్ 2పై ఫోకస్ పెట్టాడని ఇన్‌సైడ్ టాక్ నడుస్తోంది. తారక్ కూడా దేవర, వార్ 2 సినిమాలతో బిజీగా ఉన్నాడు. ఈ రెండు సినిమాల షూటింగ్‌పై క్లారిటీ వచ్చిన తర్వాత ఎన్టీఆర్ 31 రెగ్యులర్ షూటింగ్ షెడ్యూల్ పై స్పష్టత రానుందని తెలుస్తోంది.

## పవన్‌కల్యాణ్, రవితేజతో మల్టీస్టారర్

### మనసులో మాట బయటపెట్టిన హరీష్ శంకర్

సాధారణ కథకు కమర్షియల్ ఎలిమెంట్స్ జోడించి తన టేకింగ్‌తో ప్రేక్షకులను అలరించే దర్శకుడు హరీశ్ శంకర్. రవితేజ కథానాయకుడిగా ఆయన దర్శకత్వంలో రాబోతున్న చిత్రం 'మిస్టర్ బచ్చన్'. భాగ్యశ్రీ బోర్సే కథానాయిక. తాజాగా ఓ కార్యక్రమంలో పాల్గొన్న హరీశ్ శంకర్ పలు ఆసక్తికర విషయాలను పంచుకున్నారు. మల్టీస్టారర్ తీయాల్సి వస్తే ఎవరితో తీస్తారని అడగ్గా, పవన్‌కల్యాణ్, రవితేజతో చేస్తానని అన్నారు. ఈ ఇద్దరిలో ఏ ఒక్కరు తెరపై కనిపించినా మాస్ ప్రేక్షకులు విజిల్స్ హోరెత్తిస్తారు. అలాంటిది ఇద్దరు హీరోలు ఒకే ఫ్రేమ్‌లో కనిపిస్తే, పూనకాలతో ఊగిపోవడం ఖాయం. ఈ విషయం సామాజిక మాధ్యమాల వేదికగానూ ట్రెండ్ అవుతుండటంతో ఓ ట్వీట్‌కు కూడా హరీశ్ రిప్లై ఇచ్చారు. 'చాలా మంది చాలాసార్లు అడిగారు. అది కార్యరూపం దాల్చాలని ఆశిద్దాం' అన్నారు. అలాగే, మహేశ్‌బాబుతోనూ ఒక సినిమా చేయాలని ఉందని అన్నారు. అది తన చిరకాల కోరిక అని అభిప్రాయపడ్డారు. అలాగే, కొన్ని సందర్భాల్లో దర్శకుడిగా తాను ఫెయిల్ అయి ఉండవచ్చు. కానీ, తన సినిమాల విషయంలో మ్యూజిక్ డైరెక్టర్ తమన్ ఎప్పుడూ ఫెయిల్ కాలేదని హరీశ్ శంకర్ చెప్పుకొచ్చారు. ఇక 'మిస్టర్ బచ్చన్' విషయానికొస్తే, హిందీలో విజయవంతమైన 'రైడ్'కు రీమేక్‌గా దీన్ని తీసుకొస్తున్నారు. ఇప్పటికే విడుదల చేసిన పాటలు, ప్రచార చిత్రాలు సినిమాపై ఆసక్తిని పెంచాయి. రవితేజ నటన, హరీశ్ శంకర్ టేకింగ్‌తో పాటు, భాగ్యశ్రీ బోర్సే అందాలు సినిమాపై అంచాలను పెంచాయి. తొలి సినిమాతోనే సామాజిక మాధ్యమాల వేదికగా యువ హృదయాలను భాగ్యశ్రీ కొల్లగొడుతోంది.




## పోలీస్‌గా విశ్వక్‌సేన్

టాలీవుడ్ హీరో విష్వక్ సేన్ వరుస సినిమాలతో అలరించేందుకు సిద్ధమయ్యారు. రెండు చిత్రాలు సెట్స్‌పై ఉండగా.. తాజాగా మరో ప్రాజెక్ట్‌ను ప్రకటించారు. విఎస్13 వర్కింగ్ టైటిల్‌తో ఓ పోస్టర్ విడుదల చేశారు. శ్రీధర్ గంట దర్శకత్వంలో ఇది తెరకెక్కనుంది. 'కాంతార' మ్యూజిక్ డైరెక్టర్ అజనీష్ దీనికి స్వరాలు అందించనున్నారు. పోస్టర్ చూస్తే ఇందులో విష్వక్ పోలీస్‌గా కనిపించనున్నట్లు తెలుస్తోంది. యాక్షన్ డ్రామాగా ఇది రానుంది. త్వరలోనే ఈ సినిమాకు సంబంధించిన మరిన్ని వివరాలను వెల్లడించనున్నారు. ప్రస్తుతం విష్వక్ రెండు సినిమాలతో బిజీగా ఉన్నారు. రవితేజ ముళ్లపూడి దర్శకత్వంలో 'మెకానిక్ రాకీ'లో నటిస్తున్నారు. రాకీగా ఆయన మాస్ లుక్‌లో కనిపించనున్న ఈ చిత్రంలో మీనాక్షి చౌదరి కథానాయిక. కామెడీ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా ఇది రానుంది. దీనితో పాటు ఇటీవల 'లైలా' అనే కొత్త సినిమాను ప్రకటించిన సంగతి తెలిసిందే. ఇందులో ఆయన అమ్మాయిగా కనిపించనున్నారు. రామ్‌నారాయణ్ దర్శకత్వంలో రూపొందుతోన్న చిత్రమిది. ÷న్ స్క్రీన్స్ పతాకంపై సాహు గారపాటి నిర్మిస్తున్నారు. ఈ సినిమాను వచ్చే ఏడాది ఫిబ్రవరి 14న విడుదల చేయనున్నట్లు చిత్రబృందం ప్రకటించింది. విభిన్నమైన రొమాంటిక్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా రానున్నట్లు ఈ చిత్రంలో కథానాయిక పాత్రకు కూడా ప్రాధాన్యముందని సమాచారం.




**Owner, Editor, Printed & Published:** Gillala Buchi Reddy 12-114/1/85, Krishna Sai Nagar, Peerzadiguda, Medipally Mandal, Medchal-Malkajgiri District - 500098. Telangana. Printed at S.A Printers, D-No. 3-92 Shed No 2, Sy No 45 & 49, Sadasiv Nagar, Narapally Village, Ghatkasar Mandal, Medchal-Malkajgiri District, Telangana, -500098. **RNI NO TELTEL/2023/86487**, Cell: 8125972476. website: quicktodaynews.com, e-mail: quicktodaynews@gmail.com